వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
VC NEWS
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ మార్చి 17 సోమవారం2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 233
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## హూతీలపై అమెరికా

### భీకర దాడులు.. 31 మంది మృతి

యెమెన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా భీకర దాడులతో విరుచుకుపడుతోంది.



2లో

## పాక్‌తో శాంతికోసం యత్నిస్తే.. నమ్మక ద్రోహమే ఎదురైంది - మోదీ

అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్ పాడ్‌కాస్ట్‌లో అనేక అంశాలపై మాట్లాడిన ప్రధాని మోదీ.. పాక్, చైనాలతో భారత సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

# తాగుబోతోడు జాతిపితా ?..

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికిగాను ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.5,005 కోట్లు చెల్లించామని, 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.**

- ఆయన కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుంది
- ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలియాలి.. అసెంబ్లీలో వివరిస్తా
- ఆదాయం తగ్గినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం
- స్టేషన్ ఘన్‌పూర్ 'ప్రజాపాలన-ప్రగతిబాట' సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.630 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

**కొండ లక్ష్మణ్, జయశంకర్ రాష్ట్ర జాతిపితలు. కేసీఆర్ పై సిఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం.**



వరంగల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికిగాను ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.5,005 కోట్లు చెల్లించామని, 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రూ.500కే సిలిండర్‌తో పాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ సమస్యను తరిమికొట్టామన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'ప్రజాపాలన- ప్రగతిబాట' సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో రూ.630.27 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు. రూ.8.29 లక్షల కోట్ల అప్పును మా నెత్తిమీద పెట్టిపోయారు. ఇందులో రూ.లక్ష కోట్లను ఆయన కుటుంబం దోచుకుంది. గతేడాది రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే అంచనాలకు తగ్గ ఆదాయం రాలేదు. అయినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఎమ్మెల్యేగా 15 నెలలుగా జీతభత్యాలు తీసుకుంటున్న వ్యక్తి బాధ్యత తీసుకోవడం లేదు. ఇది ఇంటర్‌వెల్ మాత్రమే. అసెంబ్లీలో ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర వివరాలు వెల్లడిస్తాను. కేసీఆర్ చిట్టా విప్పుతాను. పదేళ్లలో కేసీఆర్ సర్కారు చేతికి రూ.10.80 లక్షల కోట్లు వచ్చాయి. వాటితో ఏం చేశారు? రూ.లక్ష కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు.. కూల్చారు. అది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం. కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామసాగర్, దేవాదుల, ఇందిరా, రాజీవ్ సాగర్‌లు తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నాయి. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలిస్తోంది. సోలార్ ప్లాంట్లు, బస్సుల నిర్వహణను అప్పగిస్తోంది. పాత్రికేయులకు భారాస ప్రభుత్వం పదేళ్లలో ఇవ్వలేని ప్లాట్లు ఇచ్చాం. గ్రూప్-1, 2, 3 పరీక్షలను సజావుగా నిర్వహించి ఉద్యోగాలిస్తున్నాం.

రాష్ట్రానికే స్టేషన్‌ఘన్‌పూర్ ఆదర్శంగా నిలవాలికడియం శ్రీహరితో 25 ఏళ్ల అనుబంధం ఉంది. నేను కోరడంతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఆయన ఒత్తిడి తెచ్చి రూ.800 కోట్లు మంజూరు చేయించుకున్నారు. అభివృద్ధిలో నియోజకవర్గం ఉమ్మడి వరంగల్ జిల్లాకే కాకుండా రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలి. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మామునూరు ఎయిర్‌పోర్టును తీసుకొస్తానని మాటిచ్చాను. చెప్పినట్టుగానే సాధించాను. మా ప్రభుత్వం వచ్చిన తర్వాతే వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ, ఓఆర్ఆర్, భూగర్భ డ్రైనేజీ, కాళోజీ కళాక్షేత్రం రూపుదాల్చాయి. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌ను రూ.6,500 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. కొండ లక్ష్మణ్, జయశంకర్ రాష్ట్ర జాతిపితలు.త్యాగాలు చేసినవారు రాష్ట్ర, జాతిపితలు అవుతారు తప్ప నిత్యం అబద్ధాలు చెప్పేవారు, దోచుకునేవారు కాదు. రాష్ట్రానికి అసలైన జాతిపితలు కొండా లక్ష్మణ్ బాపూజీ, జయశంకర్‌లు.

# ఖరీదైన చదువులు చదివించలేమనే..!

**వారు అభం, శుభం తెలియని ఆరేడేళ్ల పిల్లలు. ఒక బాలుడు యూకేజీ.. మరో బాలుడు ఒకటో తరగతి చదువుతున్నారు. అంత చిన్న పిల్లలు సరిగా చదవడం లేదని.. భవిష్యత్తులో ఉన్నతంగా బతకలేరని ఆ తండ్రికి ఎందుకు అనిపించిందో తెలీదు కానీ వారిని కిరాతకంగా చంపేసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం అందరినీ కలచివేస్తోంది.**

- ఇద్దరు పిల్లల్ని హతమార్చి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం అదేనా?
- ఓఎన్జీసీ ఉద్యోగి సూసైడ్ నోట్‌లోని అంశాలను ప్రస్తావించిన పోలీసులు



కాకినాడ:వారు అభం, శుభం తెలియని ఆరేడేళ్ల పిల్లలు. ఒక బాలుడు యూకేజీ.. మరో బాలుడు ఒకటో తరగతి చదువుతున్నారు. అంత చిన్న పిల్లలు సరిగా చదవడం లేదని.. భవిష్యత్తులో ఉన్నతంగా బతకలేరని ఆ తండ్రికి ఎందుకు అనిపించిందో తెలీదు కానీ వారిని కిరాతకంగా చంపేసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం అందరినీ కలచివేస్తోంది. కాకినాడ గ్రామీణం తోట సుబ్బారావునగర్‌లో నివాసం ఉంటున్న ఓఎన్జీసీ ఉద్యోగి వానపల్లి చంద్రకిశోర్ ఈ నెల 14న తన పిల్లలిద్దరినీ చంపేసి, తానూ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన ధైర్యవంతుడని, పిల్లలంటే ఎంతో ప్రేమని బంధువులు చెబుతున్నారు. కానీ, ఎందుకిలా చేశారనేది మాత్రం చిక్కుముడిగా మారింది. చంద్రకిశోర్ మా అందరికీ ధైర్యం చెబుతుండేవారని మృతుడి బావమరిది ఉమాశంకర్ చెబుతున్నారు. పిల్లల్ని రూ.లక్షన్నర ఫీజు చెల్లించి చదివించలేమనే ఉద్దేశంతో పాఠశాల నుంచి ఇటీవలే రూ.50 వేలు ఫీజున్న స్కూలుకు మార్చాల్సి రావడాన్ని ఆయన తట్టుకోలేకపోయారని పేర్కొన్నారు.ఈ కేసుకు సంబంధించి సర్పవరం స్టేషన్‌లో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, సీఐ పెద్దిరాజు ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

# అప్పులు.. అవినీతిలో కేసీఆర్‌తో రేవంత్ పోటీ

**అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేసిందని.. అప్పులు, అవినీతితో పాటు అన్ని విషయాల్లో కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్నారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.**

హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేసిందని.. అప్పులు, అవినీతితో పాటు అన్ని విషయాల్లో కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్నారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. తాజాగా ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు చేయొద్దని ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో భారాస ఇదే తీరుగా వ్యవహరించింది. కేసీఆర్‌కు మీకు తేడా ఏంటో చెప్పాలి. ఇసుక వ్యాపారం, లిక్కర్ దోపిడీ, బెల్టుషాపులు, అక్రమ భూముల వ్యాపారంలో మార్పు వచ్చిందా? చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఎప్పుడు దిగిపోతారా అని ప్రజలు చూస్తుంటే మరోమారు తాను ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. ఎవరు వస్తారో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అఖిలపక్షంలో తప్పుడు ప్రచారం చేయొద్దుతమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటుచేస్తున్న అఖిలపక్ష సమావేశంపై కిషన్‌రెడ్డి మరోమారు స్పందించారు. 'అఖిలపక్షం పెట్టుకోండి. మాకు ఏ అభ్యంతరం లేదు. కానీ మంచి సలహాలు ఇవ్వండి. తప్పుడు ప్రచారం చేయకండి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాష విధానం, జాతీయ విద్యా విధానం అంశాలపై డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న వైఖరి దివాలాకోరుతనంతో కూడింది. దక్షిణ భారతదేశానికి మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ, భాజపా దక్షిణాది రాష్ట్రాల్లో బలహీనంగా ఉన్నందున డీలిమిటేషన్‌లో సీట్లు తగ్గిస్తారంటూ రెండు నెలలుగా స్టాలిన్



వితండవాదం చేస్తున్నారు. దక్షిణాదిలో భాజపా బలంగా ఉంది. పుదుచ్చేరిలో మాదే ప్రభుత్వం, తెలంగాణలో రెండో స్థానంలో ఉన్నాం. కర్ణాటకలో త్వరలో నంబర్‌వన్ అవుతాం. వచ్చే ఏడాది తమిళనాడులో ఎన్నికలు జరగనున్నాయి.

# సీఎం రేవంత్

## ఏకపాత్రాభినయం చేస్తున్నారు'



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సెటైర్లు వేశారు. బీజేఎల్పీ కార్యాలయం నుంచి మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీల ఎగవేత, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని మండిపడ్డారు. అదే సమయంలో రేవంత్ ఏకపాత్రాభినయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 'రేవంత్ చేసిన ఏకపాత్రాభినయం నిన్న అసెంబ్లీలో చూశాం.. రేవంత్ కాలేజీ రోజుల్లో ఇలాంటి ఏకపాత్రాభినయం చేసినట్లున్నాడు. గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే.. ఎక్కడా సమాధానం చెప్పకుండా దాటవేశారు. జవాబులు చెప్పకుండా కేవలం ఎదురుదాడి చేయడమే కనిపించింది. పసలేని, స్కూలర్ లేని ఏకపాత్రాభినయం మాత్రమే రేవంత్ చేశారు. శాసనసభలో 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తానని రేవంత్ హామీ ఇచ్చారు. ఏ హామీలు గెలిపించాయో.. ఆ గ్యారెంటిలకే చట్టబద్ధత లేకుండా పోయింది. సభ ఇంకా కొనసాగుతోంది. 6 గ్యారెంటీలు, ఇచ్చిన హామీలు, అభివృద్ధి అంశాలపై చర్చకు సిద్ధమా?, తెలంగాణ ప్రజలకు ముఖం చూపించలేని దుస్థితిలో రేవంత్ సర్కార్ ఉంది. అభివృద్ధిని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయా? ఇంకా ఎవరైనా అడ్డుకుంటున్నారా అనేది చెప్పాలి. రుణమాఫీ పూర్తిచేశామని గవర్నర్ తో అబద్ధాలు చెప్పించారు.



## పాక్‌తో శాంతికోసం యత్నిస్తే.. నమ్మక ద్రోహమే ఎదురైంది - మోదీ

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌తో శాంతి కోసం ప్రయత్నాలు చేసినప్పుడల్లా శతృత్వం, నమ్మక ద్రోహమే ఎదురయ్యాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడం ఇస్లామాబాద్ నాయకత్వంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్ తో పాడ్‌కాస్ట్‌లో అనేక అంశాలపై మాట్లాడిన ప్రధాని.. పాక్, చైనాలతో భారత్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు."భారత్, పాక్‌లు కొత్త అధ్యయనాన్ని ప్రారంభించాలనే ఉద్దేశంతో 2014లో నా ప్రమాణస్వీకార కార్యక్రమానికి నాటి పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ఆహ్వానించా. శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నం చేసిన ప్రతిసారి శత్రుత్వం, మోసమే ఎదురైంది. ఇప్పటికీ నిర్ణయం వారి చేతుల్లోనే ఉంది. శాంతి మార్గాన్ని ఎంచుకుంటారని ఆశిస్తున్నా" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాక్ ప్రజలు శాంతి కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని, కలహాలు, అశాంతితో వారు అలసిపోయారన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో ఎంతోమంది అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని, ఎంతోమంది జీవితాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేరెంట్స్ ఒత్తిడితో ఇష్టంలేని కోర్సు.. విద్యార్థినికి కేంద్రమంత్రి ఫోన్ కాల్‌గతంలో ఎన్నడూ లేని విధంగా దౌత్యపర సంకేతాలు ఇచ్చామని ప్రధాని మోదీ చెప్పారు. విదేశాంగ విధానంపై గతంలో తన విధానాన్ని ప్రశ్నించినవారు.. సార్క్ దేశాధినేతలను ఆహ్వానించడాన్ని చూసి ఆశ్చర్యపోయారని గుర్తుచేశారు. భారత విదేశాంగ విధానం ఎంత పటిష్ఠంగా ఉందో చెప్పడానికి ఇదో నిదర్శనమన్నారు. శాంతి, సామరస్యానికి భారత్ నిబద్ధతతో ఉందని ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపిందని, అయినప్పటికీ ఆశించిన ఫలితాలు పొందలేకపోయామని అన్నారు.

**చైనాతో పోటీతత్వమే..**

విభేదాలు వివాదాలుగా మారకుండా చూసుకోవడంపైనే తమ దృష్టి ఉంటుందని, అసమ్మతికి బదులు చర్చలకే తాము ప్రాధాన్యం ఇస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చైనాతో సంబంధాలపై మాట్లాడుతూ.. భారత్, చైనాలు ఆరోగ్యకరమైన పోటీతత్వంతో ముందుకెళ్లాలని కోరకుంటున్నామని అన్నారు. పోటీతత్వం చెడు కాదని, అది ఎన్నడూ సంఘర్షణకు దారి తీయకూడదన్నారు. ప్రపంచ శ్రేయస్సు కోసం ఇరు దేశాల సహకారం ఎంతో అవసరమని ఉద్ఘాటించారు.

## హూతీలపై అమెరికా భీకర దాడులు.. 31 మంది మృతి

ఇంటర్నెట్‌డెస్క్: యెమెన్‌లోని హూతీలపై అమెరికా లోని ట్రంప్ సర్కారు సైనిక చర్యను మొదలుపెట్టింది. యెమెన్ రాజధాని సనా, సదా, అల్ బైదా, రాడాలే లక్ష్యంగా దాడులు జరిగాయి. ఇప్పటి వరకు 31 మంది మృతి చెందగా.. 101 మంది గాయపడినట్లు హూతీ ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. మృతుల్లో మహిళలు, చిన్నారులే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అమెరికా నౌకలు, విమానాలపై హూతీలు దాడులు చేయడాన్ని సహించేది లేదని యూఎస్ 'సెంట్రల్ కమాండ్' పేర్కొంది. ఇక అగ్రరాజ్య దాడులను హూతీ పొలిటికల్ బ్యూరో యుద్ధ నేరంగా అభివర్ణించింది. యెమెన్ దళాలు ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది. అమెరికాలో పెను తుపాను.. 33 మంది మృతితిరుగుబాటుదారులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భగ్గుమన్నారు. 'హూతీలు మీ సమయం ఆసన్నమైంది. మీ దాడులు వెంటనే ఆపేయాలి. ఊహించని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ఆయన ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, యుద్ధ నౌకలు స్వేచ్ఛగా వెళ్లకుండా ఏ ఉగ్రశక్తీ ఆపలేదన్నారు. హూతీలకు మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయాలని ఇరాన్‌ను హెచ్చరించారు. వారి చర్యలకు ఇరానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## సునీతా విలియమ్స్‌కు లైన్ క్లీచర్ రోదసీలోకి దూసుకెళ్లిన ఫాల్కన్

**వాషింగ్టన్:** మూడోసారి రోదసీలోకి వెళ్లి అంతరిక్షకేంద్రంలోనే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భూమ్మీద కాలుమోపే దిశగా అడుగులు పడ్డాయి. నాసా-స్పేస్ ఎక్స్‌లు తాజాగా క్రూ-10 మిషన్‌ను చేపట్టాయి. నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4.33 గంటలకు కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి నింగిలోకి తీసుకెళ్లింది. దాదాపు తొమ్మిది నెలలుగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌అంతరిక్ష కేంద్రం లోనే ఉంటున్న విషయం తెలిసిందే. వారిని భూమిపైకి తీసుకొచ్చేందుకు మూడు రోజుల క్రితం క్రూ-10 మిషన్ ను చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి నిమిషంలో సాంకేతిక కారణాలతో ఆ ప్రయోగాన్ని నిలిపేశారు. తాజాగా వారిని తీసుకొచ్చేందుకు మళ్లీ ప్రయోగం చేపట్టారు. డ్రాగన్ క్యాప్సుల్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన వారిలో అన్నె మె÷-లకెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్

వ్యోమగాములు ఉన్నారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో ఐఎస్-ఎస్‌కు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు చేరుకున్నారు. స్టార్‌లైనర్‌లో సమస్యలు తలెత్తడంతో వారు లేకుండానే అది భూమిపైకి చేరింది. దీంతో వారిని తీసుకురావడానికి పలు అవాంతరాల దాదాపు తొమ్మిది నెలల తర్వాత నలుగురు వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు పంపించారు.

# మరో దుందుడుకు చర్య దిశగా ట్రంప్?

### 41 దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే యోచన

**వాషింగ్టన్:** ఉద్యోగాల కోతలు, దేశాలపై సుంకాలతో దూకుడు పాలన సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పదుల కొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే అంశాన్ని ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్నారని సమాచారం. 41 దేశాల పౌరులు అగ్రరాజ్యంలోకి రాకుండా త్వరలో ప్రయాణ ఆంక్షలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఒక ఇంటర్నల్ మెమో బయటికొచ్చింది. అందులో మొత్తం ఈ 41 దేశాలను మూడు గ్రూప్‌లుగా విభజించినట్లు సమాచారం. పది దేశాలతో ఉన్న మొదటి గ్రూప్‌లో అఎ÷-గానిస్థాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తరకొరియా వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాల పౌరులకు వీసాల జారీ పూర్తిగా నిలిపివేయ నున్నారని ప్రచారం. ఇక, రెండో గ్రూప్‌లో ఇరిత్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆ మెమోలో పేర్కొన్నారు. ఈ దేశాలకు పర్యటక, విద్యార్థి వీసాల వంటివి జారీ చేయకూడదని భావిస్తున్నారు. అయితే వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి. మూడో గ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్ సహా 26 దేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ 'లోపాలను పరిష్కరించుకోవడానికి' ప్రయత్నాలు చేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యూఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. ప్రస్తుతానికి ఈ జాబితాను అమెరికా మీడియా సంస్థలు ప్రచారం చేయగా.. ఇందులో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆమోదం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్ సహా ఏడు ముస్లిం మెజారిటీ దేశాల ప్రయాణికులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఇక, 2023లోనూ ట్రంప్ ఈ ప్రణాళికల గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపడితే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని తెలిపారు. దేశ భద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ రానివ్వబోమని అన్నారు.

# మరో వారం రోజుల్లో ఐపిఎల్

### వేసవిలో మజా ఇవ్వనున్న టోర్నీ




**ముంబై:** క్రికెట్‌లో మరో మజా గేమ్ ప్రారంభం కాబోతుంది. ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీని టీమిండియా కైవసం చేసుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొంది. ఈ క్రమంలో

ఐపిఎల్‌కు తెరలేవనుంది. అభిమానులు ఎంతో అతృతతో ఎదురు చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఐపిఎల్ సీజన్ 2025కి మార్చి 22న ప్రారంభం కానుంది. మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్ తో మెగా టోర్నీకి తెరపడుతుంది. ఈసారి కూడా పది జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య మార్చి 23న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభమవుతోంది. ఈ సారి అన్ని జట్లు ట్రోఫీపై కన్నేశాయి. కిందటిసారి రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి ఎలాగైనా ఛాంపియన్‌గా నిలవాలనే పట్టుదలతో ఉంది. కోల్‌కతా కూడా టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్షంతో పోరుకు సిద్ధమైంది. ప్రస్తుత ఛాంపియన్ కోల్‌కతా కూడా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. రహానె సారథిగా రావడంతో జట్టు ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. ఇలా బరిలో ఉన్న పది జట్లలో కూడా ప్రతిభావంతులైన క్రికెటర్లు ఉండడంతో మెగా టోర్నమెంట్ ఆసక్తికరంగా సాగడం ఖాయం. ఇక ఆరంభం నుంచి టోర్నమెంట్‌లో ఆడుతున్నా ఒక్కసారి కూడా ట్రోఫీని సాధించడంలో విఫలమవుతూ వస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ ఈసారి ఆ లోటును తీర్చుకోవాలని భావిస్తున్నాయి. మూడు జట్లు కూడా కొత్త కెప్టెన్ల సారథ్యంలో బరిలోకి దిగుతున్నాయి. ఢిల్లీ అక్షర్ పటేల్‌ను కెప్టెన్‌గా నియమించుకుంది. పంజాబ్ కింగ్స్ శ్రేయస్ అయ్యర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. ఇక బెంగళూరు సారథిగా రజత్ పటిదార్ ఎంపికయ్యారు. కొత్త కెప్టెన్ల సారథ్యంలో ట్రోఫీని గెలుచుకోవాలని ఈ మూడు జట్లు తహతహలాడు తున్నాయి. ఇక ప్రస్తుత ఛాంపియన్ కోల్‌కతా కూడా కొత్త సారథిని ఎంపిక చేసింది. ఈసారి అజింక్య రహానె కోల్‌కతా టీమ్ కెప్టెన్సీ బాధ్యతలను చేపట్టనున్నాడు. కిందటి సీజన్‌లో సారథిగా ఉన్న శ్రేయస్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రిటేన్ చేసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో అతను వేలం పాటలో బరిలోకి దిగిన పంజాబ్‌కు ఎంపికయ్యాడు. పంజాబ్ టీమ్ భారీ మొత్తాన్ని వెచ్చించి శ్రేయస్‌ను సొంతం చేసుకుంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ కూడా భారీ ఆశలతో కనిపిస్తోంది. మెగా వేలం పాటలో రిషబ్ పంత్ భారీ మొత్తాన్ని వెచ్చించి సొంతం చేసుకుంది. అనుకున్నట్టే రిషబ్‌కే సారథ్య బాధ్యతలను అప్పగించింది. అతని కెప్టెన్సీలో లక్నో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గుజరాత్ టైటాన్స్ కూడా భారీ ఆశలతో పోరుకు సిద్ధమైంది. ఈసారి కూడా శుభ్‌మన్ గిల్ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. రషీద్ ఖాన్, ÷-లగెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, జోస్ బట్లర్ వంటి టి20 స్పెషలిస్ట్‌లు జట్టులో ఉన్నారు. మాజీ ఛాంపియన్‌లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌లు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఈసారి ట్రోఫీని సాధించాలనే పట్టుదలతో రెండు జట్లు కనిపిస్తున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా టైటిల్‌పై కన్నేసింది. కమిన్స్ సారథ్యంలోని హైదరాబాద్ రెండు విభాగాల్లోనూ

సమతూకంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, కమిందు మెండిస్‌లతో హైదరాబాద్ బలంగా ఉంది.

# దక్షిణాది తురుపుముక్క పవన్ కళ్యాణ్ !

జనసేనాని,ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగం పరిశీలిస్తే..ఆయనలో పరిణతి చెందిన రాజకీయ నాయకుడిని చూడవచ్చు. దేశం పట్ల, ప్రజల సమస్యల పట్ల నిబద్ధత కలిగిన నాయకుడిని చూడవచ్చు. అలాగే దక్షిణాదిలో ఇక నాయకులకు కొరత లేదన్న విషయమూ గమనించవచ్చు. ఎంతో హుందాగా, ఉన్నది ఉన్నట్లుగా.. ముక్కుసూటిగా ఆయన తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, విద్యాసాగర్ రావు లాంటి నేతల తరవాత అంతకన్నా బలమైన నాయకుడు ఆయనలో కనిపించాడు. తెలుగుదేశం నుంచి రామ్మోహన్ నాయుడు మంచి వక్తగా పేరు పొందారు. పార్లమెంటులో కూడా చురుకైనా పాత్ర పోషిస్తున్నారు. ఆయన కూడా దక్షిణాది నుంచి మంచి నేతగా ఎదిగే లక్షణాలను పుణికి పుచ్చు కున్నారు. అయితే పవన్ కళ్యాణ్ ఓ రకంగా దక్షిణాదికి తురుపుముక్కగా చెప్పుకోవచ్చు. పవన్ మాట్లాడినప్పుడల్లా ప్రకాశ్ రాజ్ లాంటి వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడినా విమర్శించన ఘనుడు ప్రకాశ్ రాజ్. తాజాగా కూడా దక్షిణాన హిందీ గురించి పవన్ కళ్యాణ్ మాట్లాడిన దానికి విపరీత వ్యాఖ్యాలను చేశారు. ఇదంతా పక్కన పెడితే దక్షిణాదిలో గట్టిగా నిలబడే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఉంటారని చెప్పడంలో సందేహం లేదు. దేశం గురించి, సమస్యల గురించి బాగా అవగాహనతో ఉన్న నేత పవన్ కళ్యాణ్ అనడంలో సందేహం లేదు. ఆయన చేసిన ప్రసంగం, సమస్యలు, దేశం పట్ల ఉన్న అవగాహన ఇవన్నీ కూడా పరిణతి చెందిన నేతగా నిలబెట్టాయనడంలో సందేహం లేదు. జనసేన 11 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని,..ఎన్నో కష్టష్టాలను ఓర్చుకుని..వేధింపులను తట్టుకుని...అరాచక పార్టీని అధికారం నుంచి దింపడమే కాదు...11 సీట్లకే పరిమితం చేశామని జనసేనాని తన పోరాట పటిమను, పడ్డ కష్టాలను వివరించారు. నిజానికి ఎపిలో జగన్ రాజ్యంలో విపక్ష నేతలను కట్టి పడేయడం లక్ష్యంగా పాలన సాగించారు. అసెంబ్లీ గేటును కూడా తాకనివ్వమని చెప్పిన వారిని అధికారానికి దూరం చేశామని పవన్ అందుకే అన్నారు. ఆయనలో ఉన్న కసి, పట్టుదలను ఈ సందర్భంగా మనం గమనించవచ్చు. ఎంతపట్టుదల, నమ్మకం, సమస్యల పట్ల అవగాహన, ప్రజల పట్ల విశ్వాసం ఉంటే తప్ప రాజకీయనేతగా నిలబడలేరు. ఎన్టీఆర్ తొలినాళ్లలో రాజకీయాల్లోకి వచ్చిన సందర్భంగా మాట్లాడిన తీరును బేరీజు వేసుకుంటే ఇప్పుడు..పవన్ కళ్యాణ్ తీరు అలాగే ఉంది. ఆయనకు దేశం పట్ల ఉన్న అంకితభావం కనిపిస్తోంది. హిందీభాష పట్ల జరుగుతున్న రగడ, సనాతన ధర్మాన్ని కించపరుస్తున్న తీరును కూడా ఆయన గట్టిగానే ఎదుర్కొన్నారు. పివి నరసింహారావు తరవాత దక్షిణాదిలో పలువురు నేతలు వెలుగులోకి వచ్చారు. ప్రముఖంగా వెంకయ్యనాయుడు, జైపాల్ రెడ్డి ఉన్నారు. వీరి తరవాత ఇప్పుడు నాయకులు లేకుండా పోయారు. భాషపై స్పష్టమైన ఆధిక్యం ఉండాలి. అలాగే తాను చేయగలనన్న ధైర్యం ఉండాలి. ఇవి పవన్‌లో చూస్తున్నాం. ఎన్నికల్లో ఓడినా అడుగు ముందుకే వేశామని, ఎన్నికల్లో విజయం సాధించామని పవన్ కల్యాణ్ అనడంలో ఓ ధైర్యం కనిపించింది. 'మనం నిలబడ్డాం.. పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం. 2019లో మనం ఓడిపోయినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు. మన ఆడపడుచుల్ని అవమానించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ఇదేం న్యాయం అని వీర మహిళలు అడిగితే కేసులు పెట్టి జైళ్లలో వేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిని కూడా జైల్లో పెట్టారు. నన్ను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారు. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టాం. దేశమంతా మన వైపు చూసేలా 100 శాతం స్ట్రయిక్ రేట్ సాధించాం అంటూ ఆయన ఉద్వేగపూరితంగా చేసిన ప్రసంగం నిజంగానే ధీరోదాత్త నాయకుడి పాత్రను ఆవిష్కరించారు. భయం లేదు కాబట్టే ఇంత దూరం వచ్చా. గుండె ధైర్యమే కవచం' అని పవన్ చేసిన ప్రసంగ పాఠం ఆయనలో లోలోతుగా ఉన్నా పరిణతి చెందిన నాయకుడిని చూడవచ్చు. 'జనసేన జన్మస్థలం తెలంగాణ.. కర్మస్థానం ఆంధ్రప్రదేశ్. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్యుల కవిత్వంతో ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించడమే గాకుండా దేశం కోసం నిలబడ తామని ప్రకటించిన తీరును చూశాక తప్పకుండా పవన్ దక్షిణ్యాది రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తారనడం లో ఎలాంటి సందేహం లేదు. అలాగే ఆయన మాటమీద నిలబడతారని కూడా చెప్పవచ్చు. డిప్యూటి సిఎంగా ఇప్పటికే ఆయన చేపట్టిన పనులు ప్రజల్లో విశ్వాసం నింపాయి. సమస్యలపై పట్టుదలతో ముందుకు సాగుతున్న తీరు కూడా ప్రజల్లో ఆదరణను పెంచాయి. రుద్రవీణ వాయిస్తా.. అగ్నిధారలు కురిపిస్తాం.. అనే మాటలు నిజం చేశాం. బహు భాషలే భారతదేశానికి మంచిదని ప్రకటించారు. తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలకు ఒకే సిద్ధాంతం ఉండాలని హిందీవ్యతిరేక తీరును గట్టిగానే తూర్పార బట్టారు. జనసేన వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించిందంటే.. అందుకు ఏడు సిద్ధాంతాలే కారణం. ఎంతో ఆలోచించి ఏడు సిద్ధాంతాలు పెట్టాం. సినిమాల్లోనూ దేశ భక్తి ఉండాలని తపించేవాడిని. సమాజంపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా? సమాజంలో మార్పు కోసం వచ్చా.. ఓట్ల కోసం కాదు. భిన్నమైన వ్యక్తుల్లో ఏకత్వం చూడగలగడమే నా ఐడియాలజీ అని భావోద్వేగంతో చేసిన ప్రసంగం ఇప్పుడు రాకీయాల్లో మార్పుకు శ్రీకారం అవుతుందనడంలో సందేహం లేదు. రాజకీయాల్లో సైద్ధాంతిక విధానాన్నే ఎంచుకున్నా. ఎంత పోరాటం చేస్తే ఇక్కడికి వచ్చాం.. అర్థం చేసుకోవాలి. బలమైన దేశం కావాలంటే.. బలమైన ప్రజలు ఉండాలి. దేశం కోసం బలంగా నిలబడే యువత ఉంటేనే దేశం మారుతుంది. భవిష్యత్తును నిర్మించే యువ నాయకత్వం రావాలి. భవిష్యత్తుకు దిశా నిర్దేశర చేయాల్సిన సమయం. సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది.

# ఒకే దేశం ఒకే ఎన్నిక చారిత్రాత్మక నిర్ణయం.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 16:

భారతదేశ అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న ప్రాముఖ్యతగల సంస్కరణల్లో మరో చారిత్రాత్మకమైన నిర్ణయం "వన్ నేషన్, వన్ ఎలక్షన్" అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్ షాప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనీ, మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అమలయితే దేశానికి కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రధాన ప్రయోజనాలు :

సంపద, వ్యయ నియంత్రణ, ప్రతి ఎన్నిక కోసం ఖర్చయ్యే వేల కోట్ల ప్రజా ధనం ఆదా అవుతుందన్నారు. తరచూ జరిగే ఎన్నికల వల్ల పాలనా పనులు అంతరాయమవకుండా, ప్రభుత్వం అభివృద్ధిపై పూర్తిగా దృష్టి సారించగలదన్నారు. నిరంతర ఎన్నికల నిర్వహణ భారాన్ని తగ్గించడం ద్వారా సమర్థవంతమైన నిర్వహణ సాధ్యమవుతుందన్నారు.
ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోకుండా వేగంగా అమలు చేయగలుగుతాం అని పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మెరుగుపడుతుందన్నారు.
ఈ వర్క్ షాప్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారీ, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి నారాయణ సహా పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పీకర్ ను అవమానించేలా మాట్లాడిన జగదీష్ రెడ్డిక్షమాపణ చెప్పాలి.

## - జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి డిమాండ్.



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 16:

అసెంబ్లీ సమావేశంలో అసెంబ్లీ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన అనుచిత వాక్యాలను ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆదేశాల మేరకు ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, గత పది సంవత్సరాల కాలంలో కేసీఆర్, బిఆర్ఎస్ పార్టీ దళితులను, గిరిజనులను బీసీలను అవమానిస్తూనే ముందుకు వెళ్లిందని, ప్రస్తుతం అసెంబ్లీలో కేటీఆర్ బరితెగించి తన ఎమ్మెల్యేలతో కలిసి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వాక్యాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తుమనీ అన్నారు. ముమ్మందు ఇలాంటి వాక్యాలు చేస్తే గుణపాఠం చెప్తామని, దళితులు గిరిజనులు మీ అంతు చూస్తారని హెచ్చరించారు. ఖబడ్దార్ కేటీఆర్ గత 14 నెలలుగా అధికారం పోయిన నుండి కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు అందరినీ అవమానించేలా ఉన్నాయని, మీ శాసనసభ్యుడు స్పీకర్ను అవమానించి మాట్లాడితే దానిని నువ్వు సమర్థించడం అనేది కెసిఆర్ నుండి నీకు వచ్చిన దొర అహంకారమేనని అన్నారు. స్పీకర్ పై అనుచిత వాక్యాలు చేసిన జగదీష్ రెడ్డి, దానిని సమర్థించిన కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డీ రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హిందువులు సంఘటితంగా ఉండాలి.

**"ధర్మజాగరణ" తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రముఖ్ అమర లింగన్న పిలుపు.**

**ఘనంగా "ఆర్ఎస్ఎస్" ఇందూరు నగరశాఖల సంగమం.**

**పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.**








వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 16:

హిందూ ధర్మం శ్రేష్ఠమైనదనీ, హిందువులు సంఘటితంగా ఉండాలనీ "ధర్మజాగరణ" తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రముఖ్ అమర లింగన్న పిలుపునిచ్చారు.
నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఇందూరు నగరశాఖ ఆధ్వర్యంలో 56 శాఖల సంగమం కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తంగా అమర లింగన్న పాల్గొని, మాట్లాడారు. హిందూ ధర్మం శ్రేష్ఠమైనది హిందువులు సంఘటితంగా ఉండాలన్నారు. లవ్ జిహాద్ లాంటి వాటిని ఎదుర్కోవడానికి మన కుటుంబాలను సమాయాత్తం చేయాలనీ, మత మార్పిడిలను నిరోధించాలని అన్నారు. జనాభా అసమతుల్యం దేశానికి పెను ప్రమాదమని, హిందువులు జాగరుకులై ప్రతినిత్యం సంఘ శాఖలో భారతమాతను స్మరిస్తూ, దేశం కోసం పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ తో పాటు విభాగ్ సహకార్యవాహ వరంగంటి శ్రీనివాస్, జిల్లా కార్యవాహ దస్తగిరి, నగర కార్యవాహ సత్యం, సుమిత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాష మనకు గర్వకారణం.

**తెలంగాణ భాష లో మరింత విస్తృతంగా సాహిత్య సృజన జరగాలి.**

**తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీల పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత.**



వేగుచుక్క న్యూస్, హైదరాబాద్

మన తెలంగాణ భాష మనకు గర్వకారణ మని, తెలంగాణ భాషను ముందు తరాలకు అందించడం మన ధ్యేయం కావాలని గౌరవ శాసనమండలి సభ్యురాలు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాదులోని తన నివాసంలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ భాషలో కవితలు మరియు కథల పోటీలకు సంబంధించిన పోస్టర్ ను ఆదివారం ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, తెలంగాణ భాషలో రాసే కవితలు, కథల తో మనుగడలో లేని తెలంగాణ పదాలు, సామెతలు, నుడికారాలు వెలుగులోకి వచ్చి తెలంగాణ అస్తిత్వం ఘనంగా నిలబడుతుందని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్న తెలంగాణ భాషలో కవితలు కథలు రాసేవారికి ఇది గొప్ప అవకాశం అని అన్నారు. ఈ బృహత్కార్యాన్ని తలపెట్టిన హరిదా రచయితల సంఘాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ కవితలను, కథలను పంపించి కవులు, రచయితలు పోటీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ, తెలంగాణ భాషలో కవితలు, కథలు రాసి మే 30వ తేదీ లోపు %ష్టుతీఱఘఝయిథీఝంఘ్ప్త్రఱ– తీఝయఏస్త్రఝఅశ్రీ.ఛశీఎ% కు జిమెయిల్ చేయాలని, వివరాలకు 9948032705 నెంబర్ కు సంప్రదించాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం అధికార ప్రతినిధి నరాల సుధాకర్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, రామ్ స్మృతిక తదితరులు పాల్గొన్నారు.

# నైతికతలేని "జర్నలిజం" విశ్వసనీయత కోల్పోతుంది.









**మహిళలు మానసిక స్థైర్యంతో ముందుకెళ్లాలి.**

**టిడబ్ల్యూజేఎఫ్, హెచ్ యుజే ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో వక్తలు.**

వేగుచుక్క న్యూస్,హైదరాబాద్, మార్చి 16:

నైతికతలేని జర్నలిజం విశ్వసనీయత కోల్పోతుందని ఎన్టీవి తెలుగు రాష్ట్రాల ఇంచార్జీ ఉమా సుధీర్ అన్నారు. ఇంటిలో గృహిణిగా ఇంటి పనులలో భాగస్వామ్యం వహిస్తూనే బాధ్యతాయుతమైన జర్నలిస్టుగా మహిళలు అనునిత్యం వొత్తిడి తో పని చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ సంయుక్త నిర్వహణలో ఆదివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జర్నలిజం, మహిళలు సవాళ్ళు అనే అంశం పై జరిగిన సెమినార్ లో పలువురు సీనియర్ మహిళా జర్నలిస్టులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమా సుధీర్ మాట్లాడుతూ, ప్రతి మహిళా జర్నలిస్టు ఎందరో కథలను చూపటం లేదా రాయటం చేస్తూ వుంటారని కథ అంటే వాస్తవానికి దగ్గరగా చెప్పటం అని అన్నారు. మహిళా జర్నలిస్టుల వారి వారి స్వానుభవాలను చెబితే జర్నలిజంలోకి కొత్తగా వచ్చే మహిళలకి ప్రేరణ గా వుంటుందని చెప్పారు. జర్నలిజం సులువు కాదనీ మహిళలకు మరింత కష్టం అని అన్నారు. పురుషాధిక్య రంగంలో నాయకత్వ స్థాయి కి ఎదగడం అంత సులువు కాదని చెబుతూ స్వీయ అనుభవాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యాలను ప్రస్తావిస్తూ జర్నలిస్ట్ లకు ప్రత్యేక హక్కులు అంటూ ఏవీ లేవని అన్నారు . హద్దులు మించిన వ్యాఖ్యానాలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్నాయని ఇది జర్నలిజం రంగంను దిగజారుస్తుందన్నారు. నైతికత లేని జర్నలిజం విశ్వసనీయత కోల్పోతుంది అని చెప్పారు.

**సీనియర్ జర్నలిస్టు స్వేచ్ఛ మాట్లాడుతూ,**

జర్నలిజం రంగం ఎంచుకొనే మహిళలు మానసిక స్థైర్యంతో వుండాలని అన్నారు. ఇతర ఉద్యోగాలు మాదిరి జర్నలిజం కాదని, పలు సంస్థల్లో కనీస సౌకర్యాలు వుండవని చెప్పారు. అందువల్ల మహిళలు జర్నలిజంలోకి ఎక్కువగా రావటం లేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికీ భావ స్వేచ్ఛ వుందనీ, అందుకనే సామాజిక మాధ్యమాల్లో ఎవరి ఆలోచనలతో వారు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సామాజిక సభ్యత, విలువలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితిల్లో నిజం చెప్పినా నమ్మని పరిస్థితికి జర్నలిజం వచ్చిందని అవేదన వ్యక్తం చేశారు.

**ఇండిపెండెంట్ జర్నలిస్టు తులసీ చంద్ మాట్లాడుతూ,**

సోషల్ మీడియాలో మహిళలపై వస్తున్న ట్రోలింగ్స్ ఎదుర్కోవటం కష్టంగా మారిందని చెప్పారు. ప్రజా సమస్యలపై నిత్యం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో అన్ని విభాగాల్లో ప్రావీణ్యత సాధించాలని మహిళా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

**టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సలీమా మాట్లాడుతూ**

మహిళా జర్నలిస్టులపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. జర్నలిజంలో వస్తున్న మార్పులకనుగుణంగా జర్నలిస్టులు అప్ డేట్ కావాలన్నారు. సభాధ్యక్షత వహించిన ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు రాధిక మాట్లాడుతూ, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా లో మహిళలు లీడర్ గా ఎదగటం చాలా అరుదు అన్నారు. ఎన్నో సవాళ్ళను ఇంట బయటా ఎదుర్కోవటంతో మహిళా జర్నలిస్టులు తీవ్ర వొత్తిడికి గురవుతున్నారని వివరించారు. సమన్వయ కర్త నాగవాణీ స్వాగతం పలుకుతూ ఫెడరేషన్ సాధించిన విజయాలు తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు సురేఖ (ఇండియన్ టివి),వాణీ పుష్ప (వార్త), కే. లలిత (నవ తెలంగాణ), దివ్య (ఆంధ్ర జ్యోతి), నవీన (10టివి), భువన (ఎన్ టివి), సన్మానం చేశారు. కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా నాగ వాణి, మణిమాల, విజయ, రోజారాణి వ్యవహరించారు.
ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవ పున్నయ్య, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, రఘు, రాజశేఖర్, హెచ్ యు జె కార్యదర్శి బి. జగదీశ్వర్ తదితర నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు మధు శ్రీ. సునీతతో పాటు 70 మందికి పైగా మహిళా జర్నలిస్టులు హాజరయ్యారు.



# తెలంగాణ హిస్టరీ, ఫ్యూచర్ కూడా కేసీఆరే.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్ :

తెలంగాణ హిస్టరీ, తెలంగాణ ఫ్యూచర్ రెండు కూడా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమ oత్రి కేసీఆరే అని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చి చెప్పారు. తానే తెలంగాణ ఫ్యూచర్ అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి పై ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నేను స్టేట్ ఫ్యూచర్ అని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారు. రేవంత్ రెడ్డి గారూ.... రాసి పెట్టుకోండి.. తెలంగాణ హిస్టరీ కెసిఆర్. తెలంగాణ ఫ్యూచర్ కూడా కేసీఆర్ యే. కెసిఆర్ కి మీరు ఏ రకంగానూ సరితూగరు." అని అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, తమకు తెలంగాణ అంటే టాస్క్ అని, ఇతరులకు తెలంగాణ అంటే రాజకీయం అని తెలిపారు. కెసిఆర్ అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని, నిద్రలో కూడా కేసీఆర్, కేసీఆర్ అంటున్నారని అన్నారు. "రైతుబంధు ఇవ్వను కానీ రఫ్ గా మాట్లాడుతా, రుణమాఫీ చెయ్యను కానీ బాగా రుబాబుగా మాట్లాడతా, సాగునీరు ఇవ్వను కానీ సోది ముచ్చట్లు అన్నీ చెబుతా, ఉద్యోగాలు ఇవ్వను కానీ ఉట్టి మాటలు చెబుతా, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇవ్వను కానీ తుఫేల్ మాటలు చెబుతాను అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారు. " అని ఎద్దేవా చేశారు. గౌరవ మర్యాదలు అనేటివి కొనుక్కుంటే వచ్చేవి కావని, మన నడవడిక, మాటతీరు, పని పేరు బట్టి ఉంటుందని చెప్పారు. కెసిఆర్ మాట్లాడితే ఏం మాట్లాడుతున్నారో అని ప్రజలు టీవీలను ఆన్ చేస్తారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతే ప్రజలు టీవీని మ్యూట్ చేసే పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడితే ముందుగానే సెన్సార్ బోర్డు వద్దకు వెళ్లి ఏ సర్టిఫికెట్ తీసుకొని వినాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో అబద్ధాలు చెప్పి తిట్లు తిని పాపాన్ని మూట కట్టుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఇఫ్తార్ విందులో జిల్లా పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ గుప్తా, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, మాజీ ఎమ్మెల్సీ విజీ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు శిర్పరాజు, సుజిత్ సింగ్ ఠాకూర్, మాజీ టిఎస్పిఎస్ డైరెక్టర్ సుమిత్రానంద్ తదితరులు పాల్గొన్నారు.



**ముఖ్యమంత్రి మాట్లాడితే ఏ సర్టిఫికెట్ తెచ్చుకొని వినాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది.**

**అబద్ధాలు చెప్పి తిట్లు తిని పాపాన్ని మూటగట్టుకోకండి.**

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్.**

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



# తమన్నా బాయ్‌ఫ్రెండ్‌కు అరుదైన వ్యాధి

సీనియర్ నటి తమన్నా భాటియా, బాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ వర్మ వివాహం చేసుకుంటారని అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఇప్పుడు షాకింగ్ న్యూస్ ఒకటి వినిపిస్తోంది. చాలా కాలంగా డేటింగ్ లో ఉన్న విజయ్ వర్మ, తమన్నా భాటియా ఇప్పుడు విడిపోయారని వార్తలు పుట్టుకొచ్చాయి. అయితే ఈ వార్తల్లో వాస్తవం లేదని తెలుస్తుంది. మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తమన్నా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే.


విజయ్ వర్మ ఎవరో కాదు. బాలీవుడ్ నటుడు.. అలాగే నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన ఎమ్‌సీఏ సినిమాలో విలన్ గా నటించాడు. అయితే చాలా కాలంగా ప్రేమలో మునిగి తేలుతున్నారు. అయితే ఈ ఇద్దరూ ఈ మధ్య విడిపోయారు అంటూ వార్తలు వచ్చాయి. తమన్నా, విజయ్ వర్మ బ్రేకప్ చేసుకున్నారని రూమర్స్ వినిపించాయి. వాటిలో నిజం లేదు అని అంటున్నారు. ఇదిలా ఉంటే విజయ్ వర్మ ఓ అరుదైన వ్యాధితో బాధపడు తున్నాడని తెలుస్తుంది. విజయ్ వర్మ తనకు విటిలిగో అంటే బొల్లి వ్యాధి ఉందని బహిరంగంగానే తెలిపారు. ఈ వ్యాధి కారణంగా తన చర్మం పై తెల్లటి మచ్చలు ఉంటాయని వివరించారు.


అలాగే దాని కారణంగా తన లైఫ్ లో అశాంతి నిండిపోయింది అని తెలిపారు. ఇదిలా ఉంటే తమన్నా విజయ్ కలిసి ఓ వెబ్ సిరీస్ లోనూ నటించారు. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని తెలుస్తుంది.

# నటి హానీ రోజ్ పై తీవ్ర ఆరోపణలు నటి ఫరా శిబిలా



నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమాతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించుకుంది హాట్ బ్యూటీ హనీరోజ్. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ ముద్దుగుమ్మ గతంలో తెలుగులో సినిమాలు చేసింది. కానీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేదు. ఆతర్వాత మలయాళం పైనే ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ వరుసగా సినిమాలు చేసి క్రేజ్ తెచ్చుకుంది. మలయాళంలో హనీ రోజ్ చాలా పాపులర్ నటి. వీరసింహారెడ్డి సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మ మరో సినిమా అనౌన్స్ చేయలేదు. చాలా రోజుల తర్వాత హనీ రాచెల్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మలయాళంతో పాటు పలు భాషల్లోనూ విడుదల కానుంది. సినిమాలే కాకుండా సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది ఈ బ్యూటీ. హనీ రోజ్ చేసిన అన్ని ఫోటోషూట్‌లు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అంతే కాదు ఈ అమ్మడు సినిమాలతో కంటే షాపింగ్ మాల్స్ ఓపినింగ్స్ తోనే కాలం గడిపేస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా హనీ రోజ్ పై ఓ నటి తీవ్ర ఆరోపణలు చేసింది. హనీరోజ్ తప్పుడు దారిలో డబ్బులు సంపాదిస్తుందని ఆమె ఆరోపించింది. ఇంతకూ ఆమె ఎవరంటే ఫరా శిబిలా. నటి ఫరా శిబిలా హనీరోజ్ గురించి మాట్లాడుతూ.. మనపై మనకు నమ్మకం ఉండాలి. అప్పుడే ముందడుగు వేయాలి. ఎవరైనా సరే ప్రతిభను నమ్ముకోవాలి కానీ శరీరాన్ని కాదు. ఇక హనీ రోజ్ ఇప్పుడు శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదిస్తోంది అంటూ చెప్పుకొచ్చింది. హనీరోజ్ డ్రస్సింగ్ గురించి నేను మాట్లాడటం లేదు. కానీ ఆమె ఫోటో షూట్స్ లో రకరకాల ఫోజులు ఇస్తూ ఫోటోలు దిగుతుంది. రకరకాల యాంగిల్స్ లో తీసిన ఫోటోలను, వీడియోలను ఆమె స్వయంగా షేర్ చేస్తోంది. ఇంస్టాగ్రామ్ లో అందరూ కూడా తమ శరీరాలను చూపిస్తూ ఎగ్జిబిషన్ పెట్టేస్తున్నారు. హనీరోజ్ కూడా అదే చేస్తుంది అని ఆమె ఆరోపించింది. హనీరోజ్ అమాయకురాలు కాదు. ఆమెకు అన్ని తెలుసు. శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదించడం అనేది తప్పు అని నా అభిప్రాయం అని తెలిపింది. మరి దీని పై హాని రోజ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.






# పవన్‌కళ్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన ప్రకాశ్‌రాజ్


జనసేనాని పవన్ కళ్యాణ్ చిత్రాడలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పలు విషయాల గురించి మాట్లాడారు. ఈ క్రమం లోనే తమిళనాట హిందీని తమపై రుద్దుతున్నారని హడావిడి చేస్తున్న కొందరి గురించి కామెంట్స్ చేశారు. అంటే పరోక్షంగా తమిళనాడు అంశాన్ని ప్రస్తావించారు. అన్ని దేశ భాషలే కదా. తమిళనాడులో హిందీ వద్దని అనడం ఎంత వరకు కరెక్ట్. మరి తమిళ సినిమాలను హిందీలోకి అనువదించకండి.. హిందీవాళ్ల డబ్బులు కావాలి.. కానీ హిందీ భాష వద్దంటే ఎలా? మనం భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికి తమిళం సహా బహుళ భాషలు కావాలి.. బహుభాషలే దేశానికి మంచిది అంటూ పవన్ కళ్యాణ్ కామెంట్ చేశారు. అంతేకాదు తమిళనాడులో సంస్కృతాన్ని తిడుతున్నారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలో అయిన ముస్లింలు అరబిక్‌లోనే ప్రార్థిస్తారు. కానీ ఎన్నడూ ఆ భాష తమకొద్దని అనలేదు. హిందువులు మాత్రం దేవాలయాలలో సంస్కృత మంత్రాలు చదవొద్దని చెబుతుంటారు. ముస్లింలని చూసి హిందువులు చాలా నేర్చుకోవాలి. రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా అన్నారు పవన్ కళ్యాణ్. ఉత్తరాది వాళ్లు తెల్లగా ఉంటారు. మేం దక్షిణాది వాళ్లం నల్లగా ఉంటామనే మాటలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి. దక్షిణాదికి చెందిన సెంగోల్.. ఉత్తరాదిన ఉన్న పార్లమెంట్‌లో ఉంది. దీని అర్థం వైరుధ్యమొస్తే విడిపోవాలని కాదు. కలిసి పరిష్కారం వెతుక్కోవాలని. విధ్వంసం చాలా తేలిక. నిర్మించటమే కష్టం అని పవన్ అన్నారు. అయితే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకి ప్రకాశ్ రాజ్ తనదైన శైలిలో స్పందించారు. మీ హిందీ భాషను మా మీద రుద్దకండి', అని చెప్పడం ఇంకో భాషను ద్వేషించడం కాదు, 'స్వాభిమానంతో మా మాతృభాషను, మా తల్లిని కాపాడుకోవడం', అని పవన్ కళ్యాణ్ గారికి 'ఎవరైనా చెప్పండి ప్లీజ్' అంటూ ప్రకాష్ రాజ్ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ గతంలో కూడా పవన్ కళ్యాణ్‌కి కౌంటర్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. తిరుమల లడ్డూ వ్యవహారం, సనాతన ధర్మం విషయంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ప్రకాశ్ రాజ్ పంచ్ లు ఇచ్చాడు.

# కార్ రేసింగ్ ట్రాక్ వద్ద శోభిత, నాగచైతన్య క్యూట్ ఫొటోలు



ప్రస్తుతం టాలీవుడ్ క్యూట్ కపుల్స్‌లో నాగ చైతన్య, శోభిత జంట ఒకటి. సమంత నుండి విడిపోయాక నాగ చైతన్య కొన్ని నెలల పాటు శోభితతో ప్రేమాయణం నడిపి గత ఏడాది వివాహం చేసుకున్నాడు. ఇక పెళ్ళైనప్పటి నుండి వీరిద్దరు చాలా సరదాగా గడుపుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్ రోల్ పోషించే శోభిత ఎప్పటికప్పుడు వాటికి సంబంధించిన ఫోటోస్ షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఈ జంట ఆమ్‌స్టర్‌డామ్ , మెక్సికోలలో వీధి వీధి తిరుగుతూ సరదాగా ఎంజాయ్ చేశారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుండి సాయంత్రం వరకు ఎలా గడిపారో ఫోటోల ద్వారా తన అభిమానులకు తెలియజేసింది. అయితే తాజాగా ఈ జంట రేసింగ్ ట్రాక్‌పై సందడి చేసింది. తండేల్ సక్సెస్ తర్వాత నాగచైతన్య, శోభిత దంపతులు హాలిడే ట్రిప్ ఎంజాయ్ చేస్తుండగా, ఈ క్రమంలోనే కార్ రేసింగ్ ట్రాక్ వద్ద తమ డేను సరదాగా గడిపారు. చై, శోభిత కలిసి రేసింగ్ ట్రాక్‌లో గడిపిన క్షణాలను శోభిత సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కాగా, చైతన్యకి రేసింగ్ అంటే చాలా ఇష్టం . అందుకే శోభితను సైతం అక్కడకు తీసుకెళ్లారు. ఆమెతో సరాదాగా రేసింగ్ కారు నడిపారు. అంతే కాదండోయ్.. నాగ చైతన్య తనకు ఇష్టమైన రేసింగ్ కారులో శోభితను కూర్చోబెట్టి ఫోటోలు దిగగా, ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇటీవలే ఈ కపుల్ యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేశారు. గతేడాది డిసెంబర్ 4న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో శోభిత మెడలో మూడు ముళ్లు వేశాడు నాగ చైతన్య. ఓ ఇంటర్వ్యూలో ఆమెతో జీవితాన్ని పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని.. తనతో అన్ని విషయాలు పంచుకుంటానని, ఎప్పుడైనా కన్‌ఫ్యూజ్ అయితే వెంటనే ఆమె సలహా తీసుకుంటానని నాగ చైతన్య స్పష్టం చేశారు. తండేల్ సక్సెస్ జోష్ లో ఉన్న నాగ చైతన్య ఇప్పుడు చాలా జోష్‌తో కనిపిస్తున్నారు. భార్య శోభితని తీసుకొని పలు ప్రాంతాలకి తిరుగుతున్నాడు. ఈ కొత్త జంటను ఇలా చూసి అక్కినేని ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. క్యూట్ కపుల్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్లు చేస్తున్నారు.





# ఆమెలో నాకు అదే నచ్చింది

కొత్త గర్ల్‌ఫ్రెండ్ గురించి చెప్పిన అమీర్‌ఖాన్

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమీర్ ఖాన్. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంతోనూ నిత్యం వార్తల్లో నిలుస్తోన్న ఆయన ఇప్పుడు మరోసారి నెట్టింట ట్రెండ్ అవుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు పెళ్లి చేసుకుని, తన ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చేసిన ఆమిర్ ఖాన్ జీవితంలోకి మళ్లీ కొత్త ప్రేమ ప్రవేశించిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆమీర్ ఖాన్ ఓ యువతితో డేటింగ్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తుంది. ఆమె పేరు గౌరి. ఆమీర్ ఖాన్ రీసెంట్ గా తన 60వ పుట్టినరోజు సందర్భంగా కొత్త స్నేహితురాలిని పరిచయం చేశాడు. ఇప్పుడు గౌరి ఆమిర్ ఖాన్ లో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించింది. ఈకామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ముందుగా ఆమీర్ ఖాన్ మాట్లాడుతూ.. గౌరిలో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించాడు. 'నన్ను ప్రశాంతంగా ఉంచే, నాకు పీస్ ను ఇచ్చే భాగస్వామి కోసం నేను వెతుకుతున్నాను.' గౌరికి ఆ లక్షణాలు ఉన్నాయి అనిఆమీర్ ఖాన్ అన్నారు. అలాగే గౌరీ మాట్లాడుతూ.. 'నాకు మంచి వాడు, సౌమ్యుడైన, శ్రద్ధగల వ్యక్తి అవసరం.' "అప్పుడు నేను ఆమీర్ ఖాన్ ను కలిశాను" అని గౌరి తెలిపింది. ఆమీర్ ఖాన్ , గౌరీ 25 సంవత్సరాలుగా ఒకరికొకరు తెలుసు. 25 సంవత్సరాలుగా తెలిసినప్పటికీ ఇద్దరి మధ్య అంతగా మాటలు ఉండేవి కాదు. "మేము ఒకటిన్నర సంవత్సరం క్రితం మళ్ళీ పరిచయమయ్యాము" అని ఆమీర్ ఖాన్ అన్నారు. గౌరి బెంగళూరులో పెరిగింది. అతను సౌత్ సినిమాల అభిమాని. ఆమె పెద్దగా హిందీ సినిమాలు చూడలేదు. గౌరీ ఏడాది క్రితం ఆమీర్ నటించిన 'దిల్ చాహ్తే హై', 'లగాన్' సినిమాలు చూసిందట. ఇక ఆమీర్ ఖాన్ మార్చి 14, 1965న జన్మించాడు. అదేవిధంగా, గౌరి ఆగస్టు 21, 1978న జన్మించింది. ఇద్దరి మధ్య దాదాపు 14 సంవత్సరాలగ్యాప్ ఉంది.